మరో నాలుగు రోజుల్లో వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఉత్తర అండమాన్ సముద్రం మీదుగా కొనసాగుతున్న ఆవర్తనం ప్రభావంతో 24 గంటల్లోపు తూర్పు, మధ్య బంగాళాఖాతం ఆనుకుని ఉన్న ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇది అక్టోబర్ 22నాటికి వాయుగుండంగా, 23నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశం ఉంది. 24నాటికి ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతానికి చేరే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల 24 నాటికి మరో వాయుగుండం ఏర్పడనుంది. ఈ ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో అక్టోబర్ 24, 25న విస్తృతంగా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

శ్రీవారి వీఐపీ దర్శన టికెట్లలో మోసం

ఎమ్మెల్సీపై కేసు నమోదు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు బ్లాక్‌లో విక్రయించారన్న ఆరోపణలతో వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానంపై తిరుమల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బెంగళూరుకు చెందిన సాయికుమార్ అనే భక్తుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్సీ జకియా ఖానం సిఫారసు లేఖపై తనకు ఆరు వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను రూ.65వేలకు విక్రయించారని సాయికుమార్ టీటీడీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బ్లాక్‌లో వీఐపీ టికెట్లు విక్రయించినట్టు నిర్ధారణ కావడంతో టీటీడీ విజిలెన్స్ వింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసులో ఏ1గా జకియా పీఏ చంద్రశేఖర్, ఏ2గా ఎమ్మెల్సీ జకియా ఖానం, ఏ3గా పీఆర్వో కృష్ణతేజ పేర్లను చేర్చారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలపై ఎమ్మెల్సీ జకియా ఖానం స్పందించారు. తాను టీడీపీలో చేరబోతున్నానని తెలుసుకొని వైసీపీ నేతలు కుట్ర పన్నారని ఆరోపించారు.

నల్లమలలో మళ్లీ యురేనియం అలజడి!

- కర్నూల్ జిల్లా కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో 68 బోర్ల తవ్వకాలకు కేంద్రం అనుమతి
- అడ్డుకునేందుకు సిద్ధమవుతున్న స్థానికులు
- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ గ్రామాల్లోనూ భయాందోళనలు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో యురేనియం నిల్వలను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్న ప్రచారంతో నల్లమల అటవీ ప్రాంతంలోని పల్లెల్లో అలజడి మొదలైంది. తాజాగా యురేనియం నిల్వలను గుర్తించేందుకు అటమిక్ మినరల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎకో ఆపరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ 68 బోర్ల తవ్వకాలకు అనుమతి ఇచ్చిందన్న ప్రచారంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆదోని రేంజ్ పత్తికొండ సెక్షన్ కప్పట్రాళ్ల ఫారెస్ట్ పరిధిలో 468.25 హెక్టార్ల అటవీశాఖకు చెందిన భూములు ఉన్నాయి. కౌలుట్లయ్యమలగా పిలిచే ఈ రిజర్వ్ ఫారెస్ట్ కప్పట్రాళ్ల, పీ కోట కొండ, మాదాపురం, చెల్లెలచెలిమిల, గుండ్లకొండ గ్రామాల మధ్య విస్తరించి ఉన్నది. ఆ కొండపైనే కౌలుట్లయ్యస్వామి ఆలయం ఉన్నది. ఈ ప్రదేశంలోనే సర్వే కోసం అనుమతులు వచ్చాయని, 6.8 హెక్టార్ల అటవీ భూమిలో బోర్‌వెల్స్ తవ్వకాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సలహామండలి ఆమోదం లభించినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఆ ప్రాంత ప్రజలు యురేనియం తవ్వకాలను అడ్డుకోవడానికి సిద్ధమవుతున్నారు. వాస్తవంగా నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం నిక్షేపాలు ఉన్నాయని, దీనికి సంబంధించి సర్వే చేసేందుకు 2016 ప్రాంతంలో ప్రయత్నాలు జరిగాయి. కానీ అప్పట్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తంకావడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. తాజాగా అటమిక్ మినరల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎకో ఆపరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ నోటిఫై చేయడంతో మరోసారి రెండు తెలుగు రాష్ట్రాల్లో యురేనియం తవ్వకాలపై మళ్లీ అలజడి నెలకొన్నది.

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ..!

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్)లో యురేనియం నిల్వలు ఎక్కడెక్కడ ఉన్నాయన్న దానిపై సర్వే చేపట్టే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని కేంద్రం 2020 మేలో కోరింది. ఢిల్లీలో జరిగిన కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ అటవీ సలహా మండలి సమావేశంలో ఏటీఆర్ పరిధిలో ప్రతిపాదిత యురేనియం నిల్వల సర్వే, వెలికితీత అంశం చర్చకు వచ్చింది. ఈ విషయంపై రాష్ట్ర వన్యప్రాణి మండలి నిర్ణయమేమిటో నివేదిక రూపంలో తమకు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం నిక్షేపాల అన్వేషణ కోసం 200, 300 మీటర్ల లోతున అటవీ ప్రాంతవ్యాప్తంగా నాలుగు వేల బోర్లు వేస్తామని, దాదాపు ఐదేండ్లపాటు ఈ సర్వే ప్రక్రియ సాగించేందుకు అనుమతివ్వాలంటూ 2019లో అటమిక్ మినరల్ డైరెక్టరేట్ (ఏఎండీ) నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. 2016 నాటి ప్రతిపాదనకు భిన్నంగా ఈ కొత్త ప్రతిపాదన ఉండటంతో తెలంగాణ అటవీ సలహా మండలి తిరస్కరించింది. ఈ కొత్త ప్రతిపాదనలను పరిశీలించలేమని, వీటివల్ల అడవితోపాటు జంతువులు, వృక్షాలకు నష్టం వాటిల్లుతుందని తెలంగాణ అటవీశాఖ స్పష్టం చేసింది. దీంతో ఏటీఆర్ పరిధిలో యురేనియం తవ్వకాలపై కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ వెనక్కి తగ్గింది. తాజాగా ఏపీలోని కప్పట్రాళ్ల అటవీప్రాంతలో యురేనియం తవ్వకాల కోసం అనుమతివ్వడంతో మళ్లీ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో కూడా అనుమతులు ఇస్తారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వికారాబాద్ జిల్లాలో దామగుండం నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును వ్యతిరేకిస్తూ.. రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, పర్యావరణవేత్తలు, స్థానిక ప్రజలు ఆందోళనలు చేసినప్పటికీ పట్టించుకోకుండా.. రాష్ట్ర ప్రభుత్వం నేవీ రాడార్ పనులకు శంకుస్థాపన చేసింది. ఈ నేపథ్యంలో నల్లమలలో యురేనియం తవ్వకాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గవర్నర్ దత్తాత్రేయకు తప్పిన ప్రమాదం



శంషాబాద్ రూరల్, అక్టోబర్ 20: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ పరిధిలో శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ప్రమాదం నుంచి ఆయన బయటపడ్డారు. ఢిల్లీ వెళ్లేందుకు కారులో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తుండగా, ముందుగా వెళ్తున్న కారును డ్రైవర్ ఒక్కసారి ఎడమవైపునకు తిప్పాడు. దీంతో గవర్నర్ కాన్వాయ్‌లోని మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొని దెబ్బతిన్నాయి. గవర్నర్‌కు ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

భూవివాదంలో అన్నను చంపిన తమ్ముడు

- తల్వార్‌తో తల, మొండెం వేరు చేసి దారుణహత్య
- ఓబులాపూర్ శివారులోని గోదావరి ప్రాంతంలో కలకలం

సాయిలు (ఫైల్)

మల్లాపూర్, అక్టోబర్ 20: పాత గొడవలను మనసులో పెట్టుకొని ఓ వ్యక్తి సొంత అన్నను అతిదారుణంగా హత్య వేశాడు. . జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఓబులాపూర్‌కు చెందిన పల్లపు నర్సయ్య- గంగు దంపతులకు ఏడుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. మూడో కుమారుడు సాయిలు (34), నాలుగో కుమారుడు చంద్రి. వీరికి కొన్నేండ్లుగా భూత గాదాలున్నాయి. పలుమార్లు పంచాయితీ పెట్టారు. పరస్పర దాడులు జరగ్గా పోలీస్‌స్టేషన్‌లో సైతం కేసులు నమోదయ్యాయి. ఆదివారం గోదావరి ప్రాంతం వద్ద సాయిలు ఉన్న విషయాన్ని గమనించి.. చంద్రి తల్వార్‌తో దాడిచేసి దారుణంగా నరికి చంపాడు. తల, మొండెం వేరు చేశాడు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని 200 గొర్రెలు మృత్యువాత

ఆసిఫాబాద్ జిల్లా ఆరేగూడ వద్ద ఘటన

సిర్పూర్(టీ), అక్టోబర్ 20 : పట్టాలపైకి చేరుకొన్న మందను రైలు ఢీకొనగా 200 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం శీర్షా గ్రామానికి చెందిన జడ భీమయ్యకు 250 గొర్రెలు-మేకలు ఉన్నాయి. వాటిని మేపుతూ శనివారం సాయంత్రం సిర్పూర్(టీ) మండలం ఆరేగూడ అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున గొర్రెల మంద ఒక్కసారిగా రైలు పట్టాలపైకి చేరింది. అదే సమయంలో వచ్చిన రైలు మందను ఢీకొట్టడంతో 200కి పైగా గొర్రెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటనతో భీమయ్య కన్నీరుమున్నీరయ్యాడు. సుమారు రూ.16 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని, సర్కారు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

• పల్నాడులో వెయ్యేండ్ల విగ్రహం

ఏపీలోని పల్నాడులో వెయ్యేళ్ల నాటి విగ్రహం ఒకటి బయటపడింది. మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం బుగ్గవాగు రిజర్వాయర్ ప్రాంతంలో శిల్పం ఉందని స్థానికులు చరిత్రకారుడు సతీశ్ బాబుకు సమాచారం అందించారు. దీంతో ఆయన రాతి శిల్పం వద్దకు మిత్రులు రమేశ్, కిరణ్‌తో కలిసి వెళ్లారు. పరిశీలించి దాన్ని వీరగల్లు విగ్రహంగా తేల్చారు. -హైదరాబాద్

శ్రీశైలం జలాశయం ఆరు గేట్ల ద్వారా దిగువకు పరుగులు పెడుతున్న వరద

నాగార్జునసాగర్‌లో 20 క్రస్ట్ గేట్ల ఎత్తివేత

శ్రీశైలంలో ఆరు గేట్లు ఎత్తివేత

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 20 : శ్రీశైలం రిజర్వాయర్ గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. జూరాల ప్రాజెక్టుకు వరద పరవళ్లు తొక్కుతుండటంతో 23 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.949 టీఎంసీల నిల్వ ఉన్నది. శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేశుల, హంద్రీ జలాశయాల నుంచి 1,95,929 క్యూసెక్కుల నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ప్రాజెక్టు గరిష్ఠ నీటి సామర్థ్యం 885 అడుగులకుగాను ప్రస్తుతం 884 అడుగుల్లో ఉన్నది. ప్రాజెక్టు ఆరు గేట్లను పది ఫీట్ల మేర ఎత్తి నీటిని దిగువకు వదిలారు. నాగార్జునసాగర్‌కు 2,44,132 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఆదివారం డ్యామ్ 20 క్రస్ట్ గేట్లు ఎత్తి 2,02,678 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కరీంనగర్ జిల్లాలోని లోయర్ మానేర్ డ్యామ్‌కు వరద పెరగడంతో ఆదివారం ఉదయం అధికారులు రెండు గేట్లు తెరిచి దిగువన మానేరుకు నీటిని వదిలారు.

హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతాం

ఐఎస్‌బీ లీడర్‌షిప్-24 సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గచ్చిబౌలిలో స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం ఐఎస్‌బీలో నిర్వహించిన లీడర్‌షిప్-24 సమ్మిట్‌కు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నాయకుడిగా ఎదగాలంటే ధైర్యం, త్యాగ గుణం ఉండాలని సూచించారు. జీవితంలో రాణించాలంటే రిస్క్ తీసుకోవాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం న్యూయార్క్, పారిస్, టోక్యో, సియోల్ లాంటి సిటీలతో పోటీపడాలని ఆకాంక్షించారు. ఐఎస్‌బీ విద్యార్థులు హైదరాబాద్, తెలంగాణతోపాటు న్యూ ఇండియాకు అంబాసిడర్లని అభివర్ణించారు.

నిర్మల్ దవాఖానలో అగ్నిప్రమాదం

మొదటి అంతస్తులో షార్ట్ సర్క్యూట్ • రోగులకు తప్పిన పెను ప్రమాదం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 20 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల దవాఖానలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తులోని శానిటేషన్ స్టోర్ రూంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున పొగ రావడంతో రోగులు ఆందోళన చెందారు. ఏం జరుగుతుందోనని బెంబేలెత్తిపోయారు. సిబ్బంది అప్రమత్తమై విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. పైఅంతస్తులోని వార్డుల్లోని రోగులను కిందకు దించారు. రోగులు పక్కవార్డులో ఉండటంతో భారీ ప్రమాదం తప్పింది. పొగ వార్డుల్లోకి వెళ్లడంతో రోగులు ఇబ్బందిపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గదిలోని ఫర్నిచర్, వస్తువులు కాలిపోయాయి. కంప్యూటర్ పరికరాలు మసిబారాయి. ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా వైద్యాధికారి రాజేందర్, అధికారులు ఘటనపై ఆరా తీశారు.

రాబడి

రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా..



బిల్లుల భారం తగ్గేదెలా?

క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..

క్రెడిట్ కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

ఈఎంఐల్లోకి మార్చడం

చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది.

బిల్లింగ్ విధానంపై అవగాహన

క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పక తమ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ సైకిల్‌ను తెలుసుకోవాలి. బ్యాంకులు క్రెడిట్-ఫ్రీ పీరియడ్‌ను కల్పిస్తాయి. ఇందులో బకాయిల చెల్లింపునకు 30 రోజుల స్టేట్‌మెంట్ సైకిల్, దానిపై 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటాయి. ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ ఏ తేదీన మొదలవుతుందో చూసుకోవాలి. ఆ తేదీ తర్వాత కొంటే మనకు పేమెంట్‌కు ఎక్కువ సమయం ఉంటుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు బిల్లు డ్యూ డేట్ ఆగస్టు 4న ఉన్నది. ఆ బిల్లు స్టేట్‌మెంట్ జూలై 18న వచ్చింది. అయితే జూలై 19న మీరు మీ క్రెడిట్ కార్డు ద్వారా ఓ వస్తువును కొన్నారు. అప్పుడు అది తర్వాతి బిల్లు స్టేట్‌మెంట్‌లో ఉంటుంది. దాన్నిబట్టి సెప్టెంబర్ 4వరకు మీరు దాని చెల్లింపునకు వ్యవధి ఉంటుందన్నమాట. ఒకవేళ జూలై 17న కొంటే ఆగస్టు 4కల్లా చెల్లించాల్సిందే. రెండ్రోజులు ఆగి కొనడం వల్ల ఇంత లాభం ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండటం వల్ల నగదు సర్దుబాటుకు వీలుంటుంది.

పర్సనల్ లోన్

క్రెడిట్ కార్డు బకాయిలపై పడే వడ్డీరేటు కన్నా.. వ్యక్తిగత రుణాలపై పడే వడ్డీరేటు తక్కువ. కాబట్టి ఎక్కువగా ఉన్న క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించేందుకు పర్సనల్ లోన్ల సహాయం తీసుకోండి. మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే వడ్డీరేటు ఇంకా తగ్గుతుంది. అలాగే మినిమం కంటే ఎక్కువగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లిస్తే మంచిది. అధిక వడ్డీ బకాయిలను ముందుగా చెల్లించాలి. తక్కువ మొత్తాలను తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతకన్నా ముందు అనవసరపు కొనుగోళ్లను తగ్గిస్తే బిల్లుల భారం తగ్గుతుంది.



ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

పొదుపుపై ధరల దెబ్బ

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్టైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి

ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

అధిక నిధి ఎలా?

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

ఈక్విటీల్లో పెట్టుబడులు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరి అని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్టైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, నగదు-బంగారంపై మిగతా

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మరువద్దు

10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒకట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్పకాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

గుర్తుంచుకోండి

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్‌డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.

పీవోఎంఐఎస్ భళా

నెలనెలా ఆదాయాన్ని ఆశించేవారు, సురక్షిత పెట్టుబడులపట్ల ఆసక్తిగలవారు పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం (పీవోఎంఐఎస్)ను పరిశీలించవచ్చు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ఆకర్షణీయ వడ్డీరేటును అందిస్తున్నది. అక్టోబర్-డిసెంబర్‌కు 7.40 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఇతర చిన్నమొత్తాల పొదుపు పథకాల వడ్డీరేట్ల మాదిరిగానే ఈ పీవోఎంఐ స్కీం వడ్డీరేటును కూడా మూడు నెలలకోసారి సవరిస్తారు. ఇక ఈ పథకం కచ్చితమైన రాబడులను మదుపరులకు అందిస్తుంది. డెట్ ఇన్వెస్ట్‌మెంట్ల కంటే అవి ఉత్తమంగానే ఉంటాయి. స్కీం మెచ్యూరిటీ కాలవ్యవధి ఐదేండ్లు. గరిష్ఠంగా రూ.9 లక్షలు పెట్టుబడిగా పెట్టవచ్చు. ఇద్దరు లేదా ముగ్గురితో కలిసి కూడా స్కీంలో చేరవచ్చు. అప్పుడు పెట్టుబడి పరిమితి రూ.15 లక్షలు. ఇక 10 ఏండ్లు దాటిన పిల్లల పేరుతో కూడా స్కీంను తీసుకోవచ్చు.

అప్రమత్తత అవసరం

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రతికూల పరిణామాల మధ్య మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 156.61 పాయింట్లు లేదా 0.19 శాతం క్షీణించి 81,224.75 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 110.20 పాయింట్లు 0.44 శాతం పతనమై 24,854.05 దగ్గర ఆగింది. ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే ఎక్కువగా వీలున్నట్టు అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ద్వితీయ త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు గత వారం మాదిరే ఈ వారం కూడా మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి మరి. అందుకే మదుపరులు అప్రమత్తంగా ఉండాలని, ఇన్వెస్ట్‌మెంట్లపై ఆచితూచి స్పందించడం ఉత్తమమని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈసారీ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. సెల్లింగ్ ప్రెషర్ భారీగా ఉంటే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,300-25,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.